గౌతు లచ్చన్న జీవితం స్ఫూర్తిదాయకం: కలెక్టర్


గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ గౌతు లచ్చన్న 116 జయంతి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గౌతు లచ్చన్న స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని, జమీందారి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారని కొనియాడారు. మద్యపాన నిషేధం కోసం లచ్చన్న ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో సూర్యనారాయణరెడ్డి, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజేంద్రకుమార్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డీపీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉగ్రం.. భద్రం..!

- పట్టు కేంద్రంలో ఉగ్రవాద కార్యకలాపాలు
- కలకలం రేపిన నూర్ మహమ్మద్ అరెస్టు
- ఆందోళన చెందుతున్న ధర్మవరం వాసులు
- స్థానికేతరుల వివరాలు సేకరించాలని డిమాండ్



6

వరదొస్తే.. వాకిట్లోకే..!

ప్రధాన వంకల్లో పేరుకుపోయిన పూడిక
పెరిగిపోయిన కంపచెట్లు
ఆక్రమణలతో కుంచించుకుపోయిన వైనం
నగర వాసులను వెంటాడుతున్న ముంపు భయం
శాశ్వత పరిష్కారం పట్టని పాలకులు, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. ప్రధాన వంకల్లో పూడిక పేరుకుపోయి, కంపచెట్లు పెరిగిపోయి నీరు ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. మురుగునీటి వ్యవస్థ కూడా లేకపోవడంతో ఏటా వర్షకాలంలో వంకలకు వరద పోటెత్తడం, ఇల్లు మునగడం (మిగతా 6వ పేజీలో..)


రజకనగర్‌లో ఏపుగా పెరిగిన మొక్కలు, చెత్తతో నిండిన నడిమివంక


కదిరి ఆర్టీసీ బస్టాండులో బస్సులోకి ఎక్కేందుకు ఎగబడుతున్న మహిళలు


తనకల్లులో సంతోషంగా బస్సు దిగివస్తున్న మహిళలు

- జిల్లాలో స్త్రీశక్తి పథకం అమలు
- మహిళలతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు
- ఎంతో ప్రయోజనం అంటున్న ప్రయాణికులు

ఉచిత సంబరం..!

● జిల్లాలో స్త్రీశక్తి పథకం అమలు ● మహిళలతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు ● ఎంతో ప్రయోజనం అంటున్న ప్రయాణికులు

పుట్టపర్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి(ఉచిత బస్సు ప్రయాణం) పథకంతో మహిళల్లో ఆనందం తాండవిస్తోంది. ఆర్టీసీ బస్సులు మహిళా ప్రయాణికులతో కిక్కిరిసి పోతున్నాయి. జిల్లాలో స్త్రీశక్తి పథకం 315ఆర్టీసీ బస్సుల్లో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండు మొదలుకుని గ్రామీణ, ప్రధాన రహదారుల్లో బస్సు స్టాంపుల వద్ద మహిళా ప్రయాణికులే కనిపించారు. అనుమతించిన ఏ బస్సులో చూసినా 70 శాతం పైగా మహిళలే కన్పించారు. జిల్లాలో ప్రతి రోజూ 1.2 లక్షల మంది ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుండగా అందులో 35వేల నుంచి 40వేల మధ్య మహిళలు ఉంటున్నారు. అయితే శనివారం ఆసంఖ్య 70వేలు దాటినట్లు ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. రోజూవారి ఇతర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లే మహిళలు, ఉద్యోగినులు, విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ఎంతో సౌకర్యంగా ఉన్నట్లు ఆయా వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

ఎంతో ఉపయోగం: సుభద్ర, హిందూపురం



చంద్రబాబు చెప్పిన విధంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో నాకు నెలకు రూ.3వేల దాకా ఆదా అవుతుంది. అనంతపురం, కర్నూలుకు నెలలో ఐదు సార్లయినా వెళ్లి వస్తాం. వేరేచోటికి రెండు మూడు రోజులు ప్రయాణిస్తాం. దీనివల్ల నెలకు మాకు రూ.3వేలు ఆదా అయినట్లే. బంధువుల ఊరికి, ఆసుపత్రికి వెళ్లి వస్తుంటాం. మాలాంటివారికి ఇది ఎంతో ఉపయోగం. ఎప్పటికీ చంద్రబాబు మేలును మరిచిపోలేం.

దైవ దర్శనానికి వచ్చా

లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రావాలని మొక్కుకున్నా. ఆమొక్కు తీర్చుకునేందుకు కదిరికి వచ్చా. ఉచిత బస్సు ప్రయాణంతో మాకు చార్జీలు ఆదా అయ్యాయి. చంద్రబాబు పుణ్యామా అని ఉచిత బస్సు ప్రయాణంతో దైవదర్శనం దివ్యంగా జరిగింది.

- మల్లీశ్వరి, మొలకల చెరువు, అన్నమయ్య జిల్లా



నెలకు రూ.వెయ్యికి పైనే ఆదా



ప్రతిరోజూ పాతర్లపల్లి నుంచి ఆర్.మరువపల్లిలోని ఐకేపీ కార్యాలయానికి వెళ్లి వస్తున్నా. రోజుకు రూ.40చొప్పున చార్జీ అవుతోంది. ప్రస్తుతం ఉచిత ప్రయాణంతో నెలకు వెయ్యికి పైగా చార్జీల డబ్బు మిగులుతుంది. ఆర్.కొట్టాల వరకు మాత్రమే ఉచిత బస్సు ప్రయాణం ఉంది. రెండు బస్సులే ఉన్నందున మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో బస్సు సౌకర్యం కల్పించాలి. - పల్లవి, యానిమేటర్, పాతర్లపల్లి

సౌకర్యంగా ఉంది



కూటమి ప్రభుత్వం మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు ప్రయాణం చాలా సౌకర్యంగా ఉంది. పరిగి నుంచి హిందూపురానికి వెళ్లేందుకు ఆధార్‌కార్డు చూపిస్తే ఉచితంగా ప్రయాణం చేయగలగడంతో ఎంతో ఆనందంగా ఉంది. కృష్ణాష్టమి సందర్భంగా సరుకులు తేవడానికి బస్సు ప్రయాణం చేశా.

- లక్ష్మీనరసమ్మ, పరిగి

మాట నిలబెట్టుకున్న బాబు : శ్రీకరి, హిందూపురం



ఎన్నికల ముందు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని చంద్రబాబు చెబితే నమ్మలేదు. కానీ నేడు ఉచితంగా అనంతపురం వెళ్తున్నా. బంధువుల ఊరికి నెలలో రెండు మూడుసార్లు వెళ్లివస్తాం. దీనివల్ల మాలాంటి వారికి చార్జీ ఆదా అయినట్లే. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్టీసీలో ఒక్కరూపాయి తక్కువ ఉన్నా కండక్టర్లు ఒప్పుకోరు. అలాంటిది ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అద్భుతం.

చాలా బాగుంది : లక్ష్మీదేవి, పెనుకొండ



కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం చాలాబాగుంది. మొదటిరోజునే పెనుకొండ నుంచి రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లి గ్రామంలోని కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లా. ప్రతిరోజూ ఎంతోమంది మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సువర్ణ అవకాశం. బస్సులు మరిన్ని పెంచి, సౌకర్యాలు పెంచాలి. రొద్దం నుంచి కేవలం రెండే ఉన్నాయి.

ప్రశాంతి నిలయంలో జన్మాష్టమి


పార్వతీ పరమేశ్వరులు

పుట్టపర్తి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతులో శనివారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వేదపఠనం, భక్తిపాటలతో గోకులం నుంచి గోవులను సాయికుల్వంతుకు తీసుకువచ్చారు. గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే గోవులు, జింకలు, కుందేళ్లకు పాలు, పండ్లు ఫలహారాలు తినిపించారు. విద్యార్థులు మంగళవాయుద్యాలతో భక్తిగీతాల ఆలాపన చేపట్టారు. సాయంత్రం విశాఖపట్నం భక్తులు సాయిపాదంలో కాంతికిరణాలు సంగీత నృత్యాన్ని నిర్వహించారు. సత్యసాయి ప్రేమతత్వం, పురాణాల్లోని ఘట్టాలను ప్రదర్శించారు. గంటపాటు డ్యాన్స్ డ్రామాతో భక్తులను అలరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.




అరటి పండ్లు తినిపిస్తున్న ఆర్‌జే రత్నాకర్

అదుపు తప్పి కారు బోల్తా

వృద్ధురాలి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు
పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘటన
(7లో...)

దుప్పి మాంసం స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు
(7లో...)

బ్యాక్ లాక్..!

- ఎస్కేయూలో మరుగునపడిన బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ
- కోర్టు కేసు నెపంతో కాగితాలకే పరిమితమైన నోటిఫికేషన్
- కేసు విత్‌డ్రా చేయించడంలో అధికారులు విఫలం
- ఎనిమిదేళ్లుగా పోస్టుల భర్తీ కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులు


శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

అనంతపురంరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో బ్యాక్‌లాగ్ పోస్టు భర్తీ మరుగున పడింది. వర్సిటీ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో పోస్టుల భర్తీ ప్రక్రియ ఎక్కడికక్కడే నిలిచి పోయింది. హైకోర్టులో కేసు నడుస్తుండటంతో పోస్టుల భర్తీ నిలిచి పోయినట్లు సమాచారం. పోస్టుల భర్తీ కోసం కేసు విత్‌డ్రా చేయించడంలో సంబంధిత అధికారులు కనీస చొరవ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు పోస్టుల భర్తీ కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు.

నోటిఫికేషన్ వెలువడి ఎనిమిదేళ్లు..

వర్సిటీలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి 2017మార్చి 30న నోటిఫికేషన్ వెలువడింది. వర్సిటీలోని అంటెండర్, వాచ్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ల్యాబ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, అసిస్టెంట్ కుక్, క్లీనర్, హెల్పర్ తదితర పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. దాదాపు 60పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీల తోపాటు దివ్యాంగుల పోస్టులకు జనరల్ అభ్యర్థులు దర ఖాస్తు చేసుకున్నారు. వర్సిటీ ఉన్నతాధికారుల లెక్క

(మిగతా 6వ పేజీలో...)

అద్దే ముద్దా..?

అద్దె భవనాల్లో ఎస్టీ గురుకుల కళాశాల నిర్వహణ
సొంత భవనాలు ఉన్నా పట్టించుకోని యంత్రాంగం

మార్చాలన్న ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు
ప్రతి నెల రూ.76వేల అద్దె చెల్లింపు

కదిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలతో సొంత భవనాలు ఉన్నా, వాటిని కాదని ఎస్టీ గురుకుల కళాశాలను అద్దె భవనంలో నిర్వహిస్తుండటంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణ శివారు ప్రాంతం కదిరి - హిందూపురం రహదారిలో అన్నమరియ భవనాల్లో ఎస్టీ గురుకుల కళాశాలను నిర్వహిస్తున్నారు. దీనికి బాడుగ నెలకు రూ.76 వేలు. దీన్ని 2014లో ప్రారంభించారు. కొన్ని నెలల పాటు తనకల్లు మండలం సీజీ ప్రాజెక్టు వద్ద ఉన్న ఎస్టీ గురుకుల పాఠశాలలో తరగతులు నిర్వహించారు. అక్కడ ఇబ్బందిగా ఉందని కదిరి మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద ఉన్న శాంతినికేతన్ పాఠశాలలో నిర్వహించారు. ఆ తరువాత హిందూపురం రోడ్డులో ఉన్న అన్న మరియ పాఠశాలల భవనాల్లోకి గురుకుల కళాశాలను మార్చారు. అప్పటి నుంచి ఇక్కడే తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ (మిగతా 6లో..)


ఎస్టీ గురుకుల కళాశాల ఉన్న బాడుగ భవనం

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఉట్టికొట్టే ఉత్సవానికి హాజరైన మంత్రి సత్యకుమార్




ధర్మవరంలోని యాదవవీధిలో ఉట్టికొడుతున్న చిన్నారులు, తిలకిస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరంరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక యాదవవీధిలోని శ్రీజయకృష్ణస్వామి దేవస్థానంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఉట్టికొట్టే మహోత్సవానికి మంత్రి సత్యకుమార్‌యాదవ్ హాజరయ్యారు. పిల్లలు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నారు. మంత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టికొట్టే మహోత్సవాన్ని తిలకించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ

● ధర్మవరంలో అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీ


ర్యాలీకి భారీగా తరలి వచ్చిన ట్రాక్టర్లు

ధర్మవరం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏపీ సీడ్స్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి పేర్కొన్నారు. పట్టణంలో శనివారం అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ ట్రాక్టర్ ర్యాలీని ఎర్రగుంట టీడీపీ కార్యాలయం నుంచి గాంధీనగర్ సర్కిల్ వరకు వందలాది ట్రాక్టర్‌లతో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని, రాష్ట్రంలో లక్షలాది మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము అందిందన్నారు. రైతుల విషయంలో పార్టీలకు అతీతంగా సీఎం చంద్రబాబు సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇలాంటి మంచి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు రైతులు కృతజ్ఞతగా ఉండాలని కోరారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిసే సుధాకర్, జక్కంపూడి సత్యనారాయణ, ప్రభాకర్‌నాయుడు, రమేష్‌బాబు, తుమ్మలమనోహర్, చల్లాశ్రీనివాసులు, గొట్లూరు శ్రీనివాసులు, పోతుకుంట లక్ష్మన్న, గంటాపురం జగ్గు, కూచిరాము, మాజీ జడ్పీటీసీ మేకల రామాంజనేయులు, విజయసారథి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై నిర్లక్ష్యం

పక్షం రోజుల కిందటే ప్రతిపాదనలు
గత ఏడాది ఇదే సమయానికి సబ్సిడీ ధరలు ఖరారు
విస్తారంగా వర్షాలతో ప్రత్యామ్నాయ సాగుకు సన్నద్ధం
సబ్సిడీ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు (7లో...)


ఆత్మకూరు మండలంలో సాగుకు సిద్ధంగా ఉన్న పొలం


స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఖాద్రీశుడి క్షేత్రం కిటకిట

కదిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం శ్రావణమాసం నాలుగో శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి దర్శనార్థం వచ్చారు. భక్తులు శుక్రవారం రాత్రే అధిక సంఖ్యలో కదిరికి రావడంతో ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. వరుసగా మూడురోజులు సెలవులు రావడంతోపాటు శనివారం శ్రీకృష్ణాష్టమి కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.

అద్దే ముద్దా..?

(5వ పేజీ తరువాయి)

గ్రూపులు మాత్రమే ఉన్నాయి. అప్పటి నుంచి ఉన్న అరకొర సౌకర్యాల తోనే కళాశాల నిర్వహిస్తున్నారు. 2014లో ఈ కళాశాలకు పక్కా భవ నాల నిర్మాణానికి దాదాపు రూ.5 కోట్లు వచ్చాయి. దీంతో భవన నిర్మా ణానికి మండలంలోని గంగన్నగారిపల్లికి సమీపంలో పునాదులు వేసి గోడలు నిర్మించారు. ఇంతలోనే ప్రభుత్వం మారడంతో ఆ భవనం నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఆ తరువాత నిధులు వెనక్కి పోయినట్లు తెలిసింది. అప్పటి నుంచి ఈ బాడుగ భవనంలోనే కళాశాల నిర్వహిస్తున్నారు.



తనకల్లు మండల కేంద్రంలో ఖాళీగా ఉన్న హాస్టల్ భవనం

బాడుగ భవనంలో బాధలు

గిరిజన గురుకుల కళాశాల ఇప్పుడు నిర్వహిస్తున్న భవనంలో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కళాశాలకు వెనుక వైపున గుట్ట ఉంది. కళాశాల భవనానికి ప్రహరీ లేదు. నీటి సౌకర్యం అరకొరగా ఉంది. ఈకళాశాలలో ప్రస్తుతం 160 మంది వరకు ఉన్నారు. మరుగుదొడ్లు, స్నానపు గదులు చాలినన్ని లేవు. అయినా అలాగే నెట్టుకొచ్చారు. గత సంవత్సర నుంచి కదిరి - హిందూపురం రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. దీంతో కళాశాలకు ముందు వైపున ఉన్న ప్రహరీని తొలగించారు. దీంతో బాలికల మరుగుదొడ్లు, స్నానపు గదులు రోడ్డుపైకి కనబడుతున్నాయి. రోడ్డు నుంచి వచ్చే దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఎవరు ఏవైపు నుంచి హాస్టల్ గదుల్లోకి వస్తారోనని భయంతో విద్యార్థినులు ఉన్నారు. అడవి ప్రాంతం కావడంతో జంతువులు, విషపురుగులు హాస్టల్ గదుల్లోకి వస్తాయన్న భయం కూడా వారిని వెంటాడుతోంది.

కళాశాలను మార్చాలని ఎమ్మెల్యే ఆదేశం

ఎస్టీ గురుకుల కళాశాలను తక్షణం తనకల్లు సీజీ ప్రాజెక్టుకు మార్చాలని ఎమ్మెల్యే కందికుంట ఆ కళాశాల అధికారులను ఆదేశించారు. నిత్యం అదే రహదారిపై వెళ్లే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అక్కడి పరిస్థితిని గమనించారు. ఈక్రమంలోనే నాలుగు రోజుల కిందట స్వయంగా ఆయనే ఆ కళాశాలకు వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అక్కడ అరకొర సౌకర్యాల నడుమ విద్యార్థినులు పడుతున్న ఇబ్బందిని చూసి చలించిపోయారు. వారంలోపు కళాశాలను ఇక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. అయితే అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు.

తనకల్లులో ఖాళీగా హాస్టల్ భవనాలు

ఎస్టీ గురుకుల కళాశాలను సీజీ ప్రాజెక్టుకు మార్చాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అక్కడ కళాశాలకు సరిపడా భవనాలు లేవని అధికార్లు చెబుతున్నారు. ఒకవేళ అక్కడ భవనాలు సరిపోకపోతే తనకల్లులో నాలుగు హాస్టల్ భవనాలు కొన్నేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. వాటిని హాస్టల్, తరగతి గదులు, ల్యాబ్‌లు, ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చని స్థానికులు చెబుతున్నారు.

అధికారులకు లేఖ పంపాం

- వెంకటరామనాయుడు, ప్రిన్సిపాల్

ఎస్టీ గురుకుల కళాశాలను తనకల్లు మండలంలోని సీజీ ప్రాజెక్టుకు మార్చడానికి ఉన్నతాధికారులకు లేఖ పంపాము. ఇక్కడి పరిస్థితులు, ఎమ్మెల్యే ఆదేశాలు అన్నిపై అధికారులకు విన్నవించాము. అక్కడి నుంచి వచ్చిన ఆదేశాలను తప్పక పాటిస్తాం.

టమోటా కిలో రూ.42

అనంతపురం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శనివారం కిలో టమోటాలు గరిష్ఠంగా 42 రూపాయల ధర పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠంగా రూ.24, సరాసరిగా రూ.32తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 3,300 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.





వనమాలీ.. బృందా విహారీ..!







ఇస్కాన్ ఆవరణలో సందడి చేస్తున్న చిన్నారులు



ఉత్సవమూర్తుల ఊరేగింపు



పోటెత్తిన భక్తజనం

శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని అనంతపురం నగరంలోని ఇస్కాన్ మందిరంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. ఆలయ ఆవరణలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, ఉట్టికొట్టే ఉత్సవం, రాధాపార్థసారథులకు విశేష పూజలు నిర్వహించారు. మూలమూర్తులకు మహాభిషేకం, పుష్పాభిషేకం చేశారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి కృష్ణ భగవానుడిని దర్శించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్

ఉగ్రం.. భద్రం..!



ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం చేయించి నూర్‌మహమ్మద్‌ను బయటకు తెస్తున్న పోలీసులు

పుట్టపర్తి/ధర్మవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చేనేత పట్టు వస్త్రాలతో అంతర్జాతీయ ఖ్యాతిగడించిన ధర్మవరంలో ఉగ్రవాద లింకులతో ఉలిక్కిపడింది. ఇక్కడే పుట్టి పెరిగిన ఓ వ్యక్తి.. ఏకంగా పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలతో సంబంధం పెట్టుకున్నాడని తెలిసి స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ధర్మవరంలోని లోనికోటకు చెందిన కొత్వాల్ నూర్ మహమ్మద్(45) వ్యవహారం కలకలం రేపుతోంది. ఇతని తల్లిదండ్రులు బీడీలు చుట్టి ఉపాధి పొందేవారు. ఆ తరువాత నూర్ మహమ్మద్ ఓ టీస్టాల్ ఏర్పాటు చేసుకుని, వ్యాపారం జరగక మూసివేశాడు. అప్పటి నుంచి హోటళ్లలో వంటమనిషిగా పనిచేస్తున్నాడు. మరో మహిళతో వివాహేతర సంబంధం కారణంగా భార్య వదిలేసి వెళ్లిపోయింది. ఉదయం బయటకు వెళితే రాత్రి వరకూ ఇంటికి వచ్చేవాడు కాదని స్థానికులు అంటున్నారు. తాము కలిసి ఉన్నప్పుడు అర్ధరాత్రి 12 గంటలకు ఇంటికి వచ్చేవాడని భార్య అంటున్నారు. ఇంట్లో, హోటల్‌లో ఎప్పుడూ ఫోన్ మాట్లాడుతుండేవాడని అందరూ చెబుతున్నారు. ఉగ్రవాదుల వాట్సాప్ గ్రూప్‌లలో అంశాలను చదివేవాడని, వాటి ప్రభావం అతనిపై ఉందని పోలీసులు నిర్ధారించారు. భవిష్యత్తులో ఏవైనా ఉగ్రవాద కార్యకలాపాలకు ప్రణాళిక రచించాడా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

భద్రత ఎంత..?

వ్యాపార కేంద్రంగా అభివృద్ధిచెందిన ధర్మవరంలో వేలాది మంది స్థానికేతరులు ఉపాధి పొందుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, శిల్క్‌హౌస్‌లలో పనిచేసేవారు, భవన నిర్మాణ కార్మికులు, డిజైనింగ్ కళాకారులు చాలామంది ఇక్కడ ఉంటున్నారు. ఇలాంటి ప్రాంతంలో స్థానికుడికి ఉగ్రవాదులతో సంబంధాలు బయటపడ్డాయి. దీంతో స్థానికేతరుల వివరాలను సమగ్రంగా సేకరించాలని పోలీసులను స్థానికులు కోరుతున్నారు. ఉపాధి కోసం కోల్‌కత్తా, బిహార్, ఛత్తీ‌స్‌గఢ్ నుంచి ఇక్కడికి చాలామంది వచ్చిపోతుంటారు. వీరి పూర్వాపరాలు తెలుసుకోకుండానే పనిలో పెట్టుకుంటుంటారు. ఇదే అదనుగా ఉగ్రవాదులు ఇక్కడ తిష్ట వేసే ప్రమాదం ఉందని అంటున్నారు. భద్రతపరమైన సమస్యలు తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వస్తోంది.

ఆందోళన కలిగించేలా..

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఉగ్రవాదుల ఆనవాళ్లు బయటపడుతున్నాయి. రాయచోటి, విజయనగరం, ధర్మవరం ఘటనలు ఇందుకు ఉదాహరణ. రాయచోటిలో ఉగ్రవాదుల నుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు. 30 ఏళ్లుగా అక్కడ స్థావరాలు ఏర్పాటుచేసుకున్న ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. ధర్మవరం పట్టణానికి చెందిన నూర్ మహమ్మద్.. ఉగ్రవాద సంస్థలతో వాట్సాప్ గ్రూపుల్లో ఉంటూ, ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించేలా పనిచేస్తున్నట్లు పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. ఈ కేసు విచారణ లోతుగా కొనసాగుతున్న నేపథ్యంలో ధర్మవరంలో ఓ యువకుడి వ్యవహారం కలకలం రేపింది. ఎర్రగుంటకు చెందిన రియాజ్ పాకిస్తాన్ స్వాతంత్ర్య దినోత్సవాలు, ఆ దేశ జెండా, సయ్యద్ బిలాల్ వీడియోలను వాట్సాప్ స్టేటస్‌గా పెట్టుకున్నాడు. అతని శనివారం అదుపులోకి తీసుకుని, విచారించి వదిపెట్టారు. ఇలాంటి పోకడలు స్థానికంగా అలజడి రేపుతున్నాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో హిందూపురం, కదిరి, ధర్మవరం ప్రాంతాల్లో అనుమానితుల సోషల్ మీడియా ఖాతా లు, పోస్టులు, చాలాంగ్‌పై పోలీసులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు కేంద్ర నిఘా వర్గాలు అందించిన సమాచారంతో నూర్ మహమ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు. బెంగళూరుకు సమీపంలో ఉండటంతో ఉగ్రవాదులు జిల్లాలోకి ప్రవేశిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.

బ్యాక్ లాక్..!

(5వ పేజీ తరువాయి)

ప్రకారం 7వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాస్తవానికి 11వేలకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

వర్సిటీకి రూ.లక్షల్లో ఆదాయం

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ నేపథ్యంలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకొన్నారు. ఈక్రమంలో ఒక్కో దరఖాస్తుకు రూ.150 చొప్పున వర్సిటీ అకౌంట్‌కి డీడీ(డిమాండ్ డ్రాఫ్ట్) రూపంలో చెల్లించారు. 11వేలకుపైగానే దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. ఈలెక్క రూ.16.5 లక్షలు వర్సిటీకి నిరుద్యోగులు చెల్లించారు. ఇంటర్వ్యూ నిర్వాహణకు అప్పటి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రక్రియ నిర్వహణకు అడ్వాన్స్‌గా రూ.రెండు లక్షల నిధులు కేటాయించినట్లు సమాచారం. అయితే పోస్టుల భర్తీలో రోస్టర్ సరిగాలేదని ఇద్దరు ముగ్గురు కోర్టు ఆశ్రయించారు. దీంతో పోస్టుల భర్తీ ఆగిపోయింది. దీనికితోడు అడ్వాన్స్ రూపంలో కేటాయించిన నిధులు ఓ అధికారి స్వాహా చేసినట్లు సమాచారం.

నిబంధనలు పట్టించుకోకుండా నోటిఫికేషన్

ఏదైన ప్రభుత్వ శాఖలో పోస్టుల భర్తీకి రోస్టర్, నియమ నింబధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆమేరకు ఫలాన పోస్టుకు ఫలాన వారు అర్హులని నిర్ణయించి భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంటుంది. అయితే ఇవేవీ అప్పటి అధికారులు చూడకుండానే గుడ్డిగా నోటిఫికేషన్ జారీ చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిజికల్లీ చాలెంజ్‌డ్ పోస్టులలో కుకింగ్ పోస్టు, హ్యాండీక్రాఫ్ట్‌కు బ్లైయిండ్ అభ్యర్థులను అర్హులుగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో ఆ అభ్యర్థులు ఆ పోస్టులకు ఏవిధంగా అర్హులంటూ కొందరూ 2017జూలైలో కోర్టును ఆశ్రయించారు. దీంతో పోస్టుల భర్తీకి బ్రేక్ పడింది. నోటిఫికేషన్ ప్రక్రియ ముందుకు సాగకుండా వర్సిటీలోని ఓ అధికారి కోర్టు మెట్లు ఎక్కించినట్లు ఆయా వర్గాల్లో జరుగుతోంది.

పోస్టుల భర్తీకి ఎదురుచూస్తున్న అభ్యర్థులు

బ్యాక్‌లాక్ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. అప్పటి వయస్సుకు అను గుణంగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈనేపథ్యంలో కేసు విత్‌డ్రా అయి పాత నోటిఫికేషన్ కొనసాగిస్తే ఎలాంటి సమస్య ఉండదు. అదే కొత్త నోటిఫికేషన్ ఇస్తే అర్హత, వయస్సు తీరిన వారంతా అర్హులు కాకుండా పోతారన్న ఆందోళన అభ్యర్థుల్లో నెలకొంది. వర్సిటీలోని టైం స్కేల్ ఉద్యోగులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. వీరికి ఇదే భయం భయం పట్టుకుంది.

పోరాటం చేస్తున్నాం



పోస్టుల భర్తీ కోసం మొదటి నుంచి పోరాటం చేస్తూనే ఉన్నాం. వర్సిటీ ఉన్నతాధికారులకు వినతులు ఇచ్చాం. గత ప్రభుత్వంలో ఇటీవల వర్సిటీ వీసీ, రిజిస్ట్రార్‌ను కలిసి, సమస్యపై వినతి పత్రం ఇచ్చాం. వీసీ, రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారు. పోస్టుల భర్తీ చేపడితే ఎంతో మంది నిరుద్యోగులకు మేలు చేకూరుతుంది.

- సంజీవులు, ప్రధాన కార్యదర్శి, టైంస్కేల్ ఉద్యోగుల అసోసియేషన్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

కౌంటర్ వేయాలని కోరాం



వర్సిటీలోని బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ నోటిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని అభ్యర్థులతోపాటు ఎస్సీ, ఎస్టీ సంఘాలు, వర్సిటీలోని టైం స్కేల్ ఉద్యోగుల అసోసియేషన్ నుంచి వినతులు వచ్చాయి. కేసు హైకోర్టులో ఉంది. వర్సిటీ వీసీ ఆదేశాల మేరకు పోస్టుల భర్తీకి సానుకూలమైన ఉత్తర్వులు పొందడానికి విశ్వవిద్యాలయం తరఫున కౌంటర్ దాఖలు చేయాలని న్యాయవాదిని కోరాం.

- రాజశేఖర్‌బాబు, రిజిస్ట్రార్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం

చీనీ టన్ను రూ.20వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 772 టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.



వరదొస్తే.. వాకిట్లోకే..!

(5వ పేజీ తరువాయి)

పరిపాటిగా మారింది. ఏళ్లుగా ఇదే దుస్థితి. నగరవాసులు సర్వం కోల్పోయి కట్టు బట్టలతో రోడ్డున పడుతున్నారు. వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టిన పాపానపోలేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నా.. వంకల్లో నీరు వెళ్లేలా కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయం. దీంతో నగరవాసులను ముంపు భయం వెంటాడుతోంది. నరగంలో ప్రధానమైన నడిమివంక, మరువ వంకలపై ఆక్రమణలను తొలగించి, విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.



నడిమివంకలో ఓ వైపు ఆక్రమణలు... మరోవైపు ఏపుగా పెరిగిన ముళ్లకంప చెట్లు



గౌరి థియేటర్ సమీపంలో మరువవంకపై ఆక్రమణలు

భయం.. భయం..

నడిమి వంక, మరువ వంక, పండమేరు వంకలతో పలు కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి. పాతూరు, కమలానగర్, రామ్‌నగర్, వేణుగోపాల్ నగర్, హెచ్చెల్సీ కాలనీ, ఆరో రోడ్డు, ఆజాద్‌నగర్, హౌసింగ్‌బోర్డు, అశోక్‌నగర్, సాయినగర్, సంగమేష్ నగర్, రజకనగర్, గంగానగర్, సోమనాథ్‌నగర్, ఆర్కే నగర్, రామచంద్రనగర్ ప్రాంతాల్లో ఇళ్లలోకి పెద్దఎత్తున వరద నీరు చేరుతోంది. ప్రధాన రహదారులను సైతం వాగులను తలపించేలా వర్షపు నీరు ముంచెత్తుతోంది.

వర్షం వచ్చిందంటే ఆయా కాలనీల ప్రజలు భయంతో వణికిపోతున్నారు. 2022లో వచ్చిన వరదలకు నడిమి వంక ఉగ్రరూపం దాల్చింది. పలు కాలనీలను వరద నీరు ముంచెత్తింది. ఆ భయాలు జనాలను వెంటాడుతూనే ఉన్నాయి.

మురుగు కాలువలు విస్తరించాలి: బాషా, అశోక్‌నగర్



అశోక్‌నగర్‌లో మరువవంక కుంచించుకుపోయింది. మురుగు, వర్షపు నీరు రోడ్డుమీదికి వస్తోంది. వర్షం పడిందో అశోక్‌నగర్ బ్రిడ్జి దగ్గర నుంచి అంబేడ్కర్ భవన్ వరకు మడుగులా మారుతుంది. చాలాసార్లు అధికారులకు కష్టాలు చెప్పాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. మరువవంకతోపాటు డ్రైనేజీ కాలువలను విస్తరించాలి. అప్పుడే సమస్య పరిష్కారమవుతుంది.

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు



వర్షాకాలంలో వరద ప్రభావాన్ని తగ్గించడంపై దృష్టి సారించాం. నడిమివంక, మరువవంకలో ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించాం. నోటీసులు జారీ చేస్తున్నాం. మురుగుకాలవలపై నిర్మించిన కట్టడాలను కూడా గుర్తించి, సంబంధికులకు నోటీసులు ఇస్తున్నాం. వర్షం పడితే నీరంతా మరువవంక, నడిమివంక ద్వారా వెళ్లిపోయేలా చూస్తాం.

- బాలస్వామి, నగరపాలక సంస్థ కమిషనర్



సూర్యానగర్ బస్టాప్ సమీపంలో మరువవంకలో చెత్తదిబ్బ

చినుకుపడితే సమస్యలు తప్పవు - మాధవి, రజకనగర్



వర్షం పడితే ఇళ్ల నుంచి కాలు బయటకు పెట్టాలంటే భయంగా ఉంటుంది. రజకనగర్ నుంచి నగరంలోకి వెళ్లాలంటే చెరువులను తలపించే రోడ్లపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. రెండు, మూడు నెలలపాటు నీటిలోనే ప్రయాణించాల్సి వస్తోంది. నీటి నిల్వ కారణంగా దోమలు వ్యాప్తి చెంది, పందులు సంచరించి రోగాలబారిన పడుతున్నాం. వాన నీరు కాలువల్లో వెళ్లిపోయేలా మురుగు కాలువలు, నడిమివంకను విస్తరించాలి.

అధికారులు కన్నెత్తి చూడరు: గౌస్‌బాషా, సాయినగర్



వర్షపు నీటితో మేం పడుతున్న ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలో అర్థంకావట్లేదు. వర్షపు నీరు ఇళ్లలోకి వస్తున్నా ఎవరూ పట్టించుకోరు. మరువవంక సమస్య పరిష్కరిస్తే మురుగు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా వెళ్లిపోతుంది. ఇప్పటికే పలుమార్లు అధికారులకు తెలియజేసినా ఫలితం లేదు.

ఎస్సీ సంక్షేమం.. అస్తవ్యస్తం..!

- డీడీ సహా కీలక పోస్టులు ఖాళీ
- పర్యవేక్షించే ఏఎస్‌డబ్ల్యుఓలూ కరువే
- సిబ్బంది ఇష్టారాజ్యం

అనంతపురం విద్య, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ సంక్షేమ శాఖ అస్తవ్యస్తంగా మారింది. కీలక పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో పర్యవేక్షణ కొరవడింది.హాస్టళ్లు, కార్యాలయాల్లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆరు నెలలుగా కీలకమైన జిల్లా డిప్యూటీ డైరెక్టర్(డీడీ) పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ప్రస్తుతం బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారి ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. ఆమె తన శాఖతోపాటు బీసీ హాస్టళ్ల పర్యవేక్షణకే తలమునకలవుతున్నారు. పాఠశాలలు తెరిచి రెండున్నర నెలలు కావస్తున్నా.. ఆమె తమశాఖ హాస్టళ్లను పర్యవేక్షణ చేయలేదనే ఆరోపవిమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్సీ సంక్షేమ శాఖను ఆమె తూతూ మంత్రంగా చూస్తున్నారు. దీంతో ఎస్సీ సంక్షేమ శాఖ జిల్లా, డివిజన్ కార్యాలయాలు, హాస్టళ్ల వార్డెన్లు, ఇతర సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహారాలు సాగిస్తున్నారనే ప్రచారం ఉంది. వారు విధులకు కూడా సక్రమంగా వెళ్లడంలేదని, ఒకవేళ వెళ్లినా హాజరు వేసుకొని వెళ్లిపోతున్నారనే విమర్శలు ఉన్నాయి.



పెన్నార్‌భవన్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా కార్యాలయం



ఖాళీగా ఉన్న ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కుర్చీ

డివిజన్ కార్యాలయాల్లోనూ అంతే..

హాస్టళ్ల పర్యవేక్షణకు డివిజన్ స్థాయిలో ఏఎస్‌డబ్ల్యుఓలు ఉంటారు. జిల్లాలో అనంతపురం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, గుత్తి, తాడిపత్రి డివిజన్‌లు ఉన్నాయి. ఇందులో చాలా నెలలుగా ఉరవకొండ, గుత్తి డివిజన్‌లకు రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యుఓలు లేరు. తాజాగా అనంతపురం డివిజన్ ఏఎస్‌డబ్ల్యుఓగా ఉన్న దామోదరరెడ్డి ఉద్యోగోన్నతిపై అన్నమయ్య జిల్లాకు డీడీగా వెళ్లారు. దీంతో ఆ పోస్టు కూడా ఖాళీ పడింది. ప్రస్తుతం ఉన్న ఇద్దరు రెగ్యులర్ ఏఎస్‌డబ్ల్యుఓలలో ఒకరికి ఉరవకొండ, మరొకరికి గుత్తి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అనంతపురం డివిజన్ ఇన్‌చార్జ్ బాధ్యతలను బీకేఎస్ హాస్టల్ సీనియర్ వార్డెన్ రామునాయక్‌కు అప్పగించారు. దీన్నిబట్టి డివిజన్‌ల స్థాయిలో కూడా ఎస్సీ సంక్షేమ శాఖ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి కీలక పోస్టుల్లో అధికారులను నియమించి గాడి తప్పిన ఆ శాఖను సక్రమమార్గంలో ఉంచాల్సిన అవసరం ఉంది.

ప్రత్యామ్నాయంపై నిర్లక్ష్యం

పక్షం రోజుల కిందటే ప్రతిపాదనలు

గత ఏడాది ఇదే సమయానికి సబ్సిడీ ధరలు ఖరారు

విస్తారంగా వర్షాలతో ప్రత్యామ్నాయ సాగుకు సన్నద్ధం

సబ్సిడీ విత్తనాల కోసం రైతుల ఎదురుచూపు


ఆత్మకూరు మండలంలో ప్రత్యామ్నాయ సాగుకు సిద్ధంగా ఉన్న పొలం

అనంతపురం అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఖరీఫ్‌లో వేరుశనగ, ఇతర పంటలు సాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. దీంతో జిల్లాకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనరేట్‌కు పక్షం రోజుల క్రితమే ప్రతిపాదనలు పంపింది. పొలాల్లో పదును ఆరగానే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం సన్న, చిన్నకారు రైతులు నిరీక్షిస్తున్నారు.

ఈ సారి అరకొరగానే సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లులుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55,296, పత్తి 44వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలు ఉన్నాయి. ఈ సారి ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 1.81 లక్షల హెక్టార్లల్లో (53 శాతం) మాత్రమే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 59వేల హెక్టార్లల్లో మాత్రమే సాగయింది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు సాగు చేశారు.

పక్షం రోజుల క్రితమే ప్రతిపాదనలు

ఈసారి ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల్లో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. ఈ నేపథ్యంలో గత పక్షం రోజుల క్రితమే జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపింది. జిల్లాలో 48,240 హెక్టార్లల్లో ప్రత్యామ్నాయ విత్తనాలు సాగు చేసేందుకు 9,245 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇందులో ఉలవలు 5,945 క్వింటాళ్లు, పెసలు 1504, అలసంద 1050, కొర్ర 262, జొన్నలు 484 క్వింటాళ్ల అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికైనా ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నా



ఈ ఏడాది పదును వర్షం పడకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయా. గత కొన్ని రోజులుగా వానలు బాగా పడుతున్నాయి. నాకున్న ఆరు ఎకరాల్లో పెసర, కొర్ర పంటలు సాగు చేయాలనుకుంటున్నా. ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నా. సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందించి, ప్రభుత్వం ఆదుకోవాలి. లేకపోతే బహిరంగ మార్కెట్‌లో అప్పు చేసి విత్తనాలు కొనాల్సిన పరిస్థితి ఉంటుంది.

- శ్రీనివాసులు, రైతు, చిన్నమట్లగొంది, శింగనమల

ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయాలి



ఈసారి వర్షాభావ పరిస్థితులతో చాలా మంది రైతులు ప్రధాన పంటలు సాగు చేయలేకపోయారు. గత కొన్ని రోజులుగా పదును వర్షం పడుతుండటంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలమైన సమయం ఇదే. దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయాలి.

- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలం



వర్షాభావ పరిస్థితులతో ఈసారి ఖరీఫ్‌లో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో రైతులు సాగు చేయలేకపోయారు. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పదును వర్షం పడుతోంది. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు ఇది సరైన సమయం. కొర్ర, అలసంద, జొన్న, పెసలు, ఉలవలు తదితర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చు. ఈనెల 15వతేదీ నుంచి సెప్టెంబరు దాకా ప్రత్యామ్నాయ పంటలు సాగుకు అనుకూలంగా ఉంటుంది.

- చంద్రాయుడు, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, కళ్యాణదుర్గం

గంజాయి పట్టివేత


అరెస్ట్ చూపుతున్న రూరల్ సీఐ

తాడిపత్రి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కలూరు క్రాస్ సమీపంలో శనివారం గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలకేంద్రానికి చెందిన శేషాద్రి, మరో బాలుడు 610 గ్రాముల గంజాయి తీసుకువచ్చి చుక్కలూరు క్రాస్ వద్ద విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని సీఐ పేర్కొన్నారు. వారిని విచారించగా ఒడిసా నుంచి ఆత్మకూరుకు తీసుకువచ్చి అక్కడి నుంచి తాడిపత్రికి వచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారన్నారు. శేషాద్రిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. బాలుడికి 16 ఏళ్ల లోపు వయసు ఉండటంతో బాల నేరస్థుల జైలుకు పంపించినట్లు తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు. మృతుడి వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహంపై నీలం రంగు టీషర్టు, సిమెంట్ కలర్ ప్యాంటు ఉన్నాయన్నారు. శనివారం రాత్రి 1 గంట తరువాత వెంకటాంపల్లి నుంచి ఖాదర్‌పేట స్టేషన్ల మధ్యలో రైల్వే ట్రాక్‌పై పడి మృతి చెందినట్లు తెలిపారు. ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే స్టేషన్‌లోని ఎస్‌ఐ వెంకటేష్ 9441445354ను సంప్రదించాలన్నారు.

దుప్పి మాంసం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు

గోరంట్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరావులపల్లి తండా సమీపంలోని తోపులో 12 కిలోల దుప్పి మాంసాన్ని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. కరావులపల్లి తండాకు చెందిన శివనాయక్‌ను అరెస్టు చేయగా మరో ఇద్దరు నిందితులు పారిపోయారని పేర్కొన్నారు. కరావులపల్లి తండాకు చెందిన శివనాయక్, దొమ్మెర వెంకటరమణ, గుమ్మయ్యగారిపల్లికి చెందిన దొమ్మెర క్రిష్టప్ప తండా సమీపంలో చిత్రావతి నది పరివాహక ప్రాంతంలో వన్యప్రాణిని వధించినట్లు తెలిపారు. అక్కమ్మగారి గుడి సమీపంలోని తోపులో మాంసాన్ని ముక్కలు చేస్తుండగా అందిన సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు వివరించారు. శివనాయక్‌ను పట్టుకున్నామని, వెంకటరమణ, క్రిష్ట పరారుకాగా గాలిస్తున్నామని అన్నారు. శివనాయక్ తెలిపిన వివరాల మేరకు దుప్పి మాంసంగా పేర్కొన్నారు. కేసు నమోదుచేసి, శివనాయక్‌ను రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌ఓ చంద్రనాయక్, ఎఫ్‌బీఓ రామక్రిష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

దోపిడీ కేసు నిందితుడి అరెస్ట్

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కలకలం రేపిన తూమకుంట ఎస్‌బీఐ బ్యాంక్ దోపిడీ కేసులో ఒక నిందితుడిని శనివారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ మహేష్ తెలిపారు. గత నెల 26న రాత్రి హిందూపురం మండలం తూమకుంట ఎస్‌బీఐ బ్యాంకులో సుమారు 12 కిలోల బంగారం, రూ.40లక్షల నగదును దుండగులు దోచుకెళ్లారు. రెండ్రోజుల అనంతరం బ్యాంక్ అధికారులు చూసుకుని ఫిర్యాదు చేయగా సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. డీఎస్పీ మహేష్ ఆధ్వర్యంలో ఆరు బృందాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయి. ఎలాంటి ఆధారం దొరకకుండా నేరస్థులు దోచుకెళ్లారు. పాత నేరస్తుడిని విచారించి మరికొన్ని సాంకేతిక ఆధారాలతో హరియాణాకు చెందిన అనిల్‌కుమార్ పన్వార్, అతడి అనుచరులు చేసినట్లు అనుమానించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిబంధనల ప్రకారం అతడిని ఇక్కడికి తీసుకొచ్చి శనివారం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. తరువాత పోలీస్ కస్టడీకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తామని డీఎస్పీ తెలిపారు. వారంలోపే చోరీ అయిన బంగారం, మరికొందరు నిందితులను అరెస్ట్ చూపుతామని డీఎస్పీ తెలిపారు. కాగా, పోలీసులు అరెస్ట్ చేసిన ప్రధాన నిందితుడు ఎత్తుకెళ్లిన బంగారం ఇతరులకు విక్రయించినట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల్లో విక్రయించడంవల్ల రికవరీ చేయడం కొంత ఆలస్యమవుతుందని పోలీసులు భావిస్తున్నారు.

జిల్లా యువకుడికి రాష్ట్రపతి అభినందనలు


భరత్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న రాష్ట్రపతి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్‌ను రాష్ట్రపతి అభినందించారు. శనివారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన జిల్లా యువకుడు బిసాటి భరత్ వన్‌నేషన్ వన్ ఎలెక్షన్ అనే అంశంపై చర్చించారు. ప్రతిభావంతులచే ఏర్పాటు చేసిన సంవిధాన్ సపోర్ట్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్న భరత్‌కు సర్టిఫికెట్ అందజేసి అభినందించారు. సంవిధాన్ సపోర్ట్ గ్రూప్ సభ్యులతో కలిసి ఒకదేశం ఒకే ఎన్నికలు అంశంపై రాష్ట్రపతికి నివేదిక అందజేశారు. లక్షలాది మంది యువత సంతకాల సేకరణ, 320 మంది ఎంపీలను కలిసి వివరించి, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఒక రోజు నిరాహారీ దీక్ష చేసిన వారిలో భరత్ ప్రాతినిధ్యం వహించారు. భరత్ సేవాకృషిని రాష్ట్రపతి అభినందించారు.

అదుపు తప్పి కారు బోల్తా

వృద్ధురాలి మృతి.. మరో నలుగురికి తీవ్రగాయాలు

పెళ్లికి వెళ్లి వస్తుండగా ఘటన



నుజ్జునుజ్జైన కారు, మృతిచెందిన వరలక్ష్మి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కూడేరు మండలం కలగళ్లకు చెందిన అభిలాష్‌గౌడ్, శిల్ప దంపతులు బెంగుళూరులో స్థిరపడ్డారు. వారు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉరవకొండలో జరిగిన బంధువుల పెళ్లికి వెళ్లారు. శుభ కార్యం ముగించుకుని తిరిగి కారులో బెంగుళూరు వెళుతున్నారు. చెన్నేకొత్తపల్లి సమీపంలోకి రాగానే కారు ముందర టైరు పేలి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో వరలక్ష్మి(60) అక్కడికక్కడే మృతి చెందారు. అభిలాష్‌గౌడ్, శిల్ప దంపతులతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. పోలీసులు సంఘటనా స్థలానికి పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు మరో అవకాశం

అనంతపురం అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్‌దారుల రీ వెరిఫికేషన్‌లో వైద్య బృందాలు నిర్ధారించిన వైకల్య శాతంలో ఏదైనా తేడాలు ఉంటే మరోసారి దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఆర్‌డీఏ పీడీ శైలజ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనారోగ్యం, దివ్యాంగుల కేటగిరీల్లో పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులకు ఈ ఏడాది జనవరి నుంచి ప్రత్యేక వైద్య బృందాలతో రీ వెరిఫికేషన్ చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి దాకా నిర్వహించిన పునఃపరిశీలనలో కొందరు పింఛన్‌దారులకు వైకల్య శాతం తగ్గడం, వ్యాధి తీవ్ర తగ్గడంతో 40 శాతం నుంచి 80 శాతం వైకల్యం ఉండి తీవ్రమైన అనారోగ్యం లేకపోయినా రూ.15వేలు పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులకు కేటగిరిని రూ.6వేల పింఛన్‌కు మార్చినట్లు పేర్కొన్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్య శాతం ఉండడంతోపాటు 60 సంవత్సరాల వయస్సు కలిగిన వారిని వృద్ధాప్య పింఛన్ కేటగిరికి మార్చారని అన్నారు. 40 శాతం కంటే తక్కువ వైకల్య ఉండి, 60 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన వారికి నోటీసులు జారీ చేసి వారి పింఛన్ల రద్దు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. ఈ ప్రక్రియను ఈనెల 14వతేదీ నుంచి ఈనెల 25వతేదీలోపు పూర్తి చేయాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా సచివాలయ సిబ్బందికి ఆదేశించామన్నారు. కొత్త సదరం ధ్రువీకరణ పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఉచితంగా జారీ చేస్తారన్నారు. వైద్య బృందాలు నిర్ధారించిన వైకల్య శాతంలో ఏవైనా తేడాలున్నాయని భావించే లబ్ధిదారులు మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. పునఃపరిశీలన తర్వాత పింఛన్ రద్దయిన లబ్ధిదారులు వారి పాత సదరం సర్టిఫికెట్, పింఛన్ రద్దు నోటీసులతో జిల్లా ప్రభుత్వాసుపత్రి లేదా ఏరియా ఆసుపత్రికి వెళ్లి సంబంధిత డాక్టర్‌తో పరిశీలన చేయించుకొని, నిబంధనల ప్రకారం ఉన్న ప్రొఫార్మాలో కొత్త మాన్యువల్ మెడికల్ సర్టిఫికెట్‌ను పొందాలన్నారు. అప్పీల్ నోటీసు, మాన్యువల్ మెడికల్ సర్టిఫికెట్‌తోపాటు మిగిలిన పత్రాలు (అప్పీల్ లెటర్, ఆధార్, రేషన్‌కార్డు, ఫొటో తదితర పత్రాలు) కలిపి సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నోటీసు అందించిన 30 రోజుల్లోపు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గర్భిణి ఆత్మహత్య కేసులో నిందితుల అరెస్ట్


అరెస్టు చూపుతున్న పట్టణ సీఐ యువరాజు

కళ్యాణదుర్గం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం వేధింపులతోనే గర్భిణి శ్రావణి (22) ఆత్మహత్య చేసుకుందని కళ్యాణదుర్గం పట్టణ సీఐ యువరాజు తెలిపారు. ఇందుకు కారకులైన భర్త బోయ శ్రీనివాసులు, అత్తమామలు బోయ కరియమ్మ, బోయ శివప్పను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు శనివారం పట్టణ సీఐ యువరాజు విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బోయ శ్రీనివాసులుకు, ఇదే పట్టణానికి చెందిన తలారి శ్రావణితో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండు సంవత్సరాల పరిణీత కుమార్తె వుంది. అదనపు కట్నం తీసుకురావాలని తరచూ భర్త శ్రీనివాసులు, అత్తమామలు కరియమ్మ, శివప్ప మానసికంగా, శారీరకంగా శ్రావణిని ఇబ్బందులు పెట్టేవారు. చివరికి పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసినప్పటికీ సమస్య సద్దుమణగలేదు. రోజురోజుకీ అదనపు కట్నం వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన శ్రావణి పట్టణంలో వున్న తన పుట్టింటిలోనే ఈ నెల 14న ఇంటి పైకప్పునకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో భర్త, అత్తమామలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ

శ్రావణి చనిపోయే ముందు మూడు నెలల గర్భవతిగా వుంది. ఆమె చనిపోయే ముందు తన చావుకు పోలీసులు, భర్త, అత్త,మామల వేధింపులే కారణమని వాయిస్ రికార్డుతో సోషల్ మీడియాలో వైరల్ చేయడం కలకలం రేపింది. తనను భర్త, అత్తమామలు వేధిస్తున్నారని ఈ నెల 11న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదని ఆమె పేర్కొన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు పట్టించుకోలేదన్న ఆవేదనతో ఈ నెల 14న బలవన్మరణానికి పాల్పడింది. నిండు ప్రాణం పోయాక మేల్కొని భర్త, అత్తమామలను అరెస్టు చేసిన పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆమె ఫిర్యాదు చేసిన రోజే పోలీసులు స్పందించి భరోసానిచ్చి వుంటే ఒక నిండు ప్రాణం బలయ్యేదికాదని చర్చించుకుంటున్నారు. పోలీసులపై ఎస్పీ సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

భజే వాయుపుత్రం..!

- కసాపురం, నేమకల్లు, మురడికి పోటెత్తిన భక్తులు

గుంతకల్లు/బొమ్మనహాళ్/డీ.హీరేహాళ్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలో నాలుగో శనివారం కసాపురం, నేమకల్లు, మురడి ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 7 గంటల నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుదీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. కసాపురం దేవస్థానంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం, మధ్యాహ్నం మహా మంగళహారతి నిర్వహించారు. రాత్రికి గరుడ వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాముల ఉత్సవ విగ్రహాలను సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీలో ఆశీనులను గావించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. నేమకల్లులో ఆదివారం వేకువజామున ఉత్సవం, సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో నరసింహారెడ్డి తెలిపారు. మురడి ఆలయానికి ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.


గరుడ వాహనంపై స్వామివార్ల ప్రాకారోత్సవం


నేమకల్లు


మురడి

ఇస్కాన్ చుట్టూ డ్రోన్ నిఘా


డ్రోన్ నిఘాలో ఇస్కాన్ టెంపుల్

అనంతపురం క్రైం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన ఇస్కాన్ దేవాలయం చుట్టూ పోలీసులు డ్రోన్లలో నిఘా పెట్టారు. పండుగ నేపథ్యంలో భక్తులు శనివారం భారీగా తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకూడదని జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశించడంతో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లతో నిఘా పెట్టడంతోపాటు, ఆలయ పరిసరాల్లో ఎలాంటి తోపులాటలు, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ జామ్ లేకుండా, చోరీలు జరగకుండా, దర్శనాలు సాఫీగా సాగేలా పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఉత్తమ టీచర్ల కోసం ఇంటర్వ్యూలు


టీచర్లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న జిల్లాకమిటీ అధికారులు

అనంతపురం విద్య, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్ల అవార్డు పక్రియకు జిల్లా విద్యాశాఖ శ్రీకారం చుట్టింది, ఈ అవార్డు కోసం 19మంది టీచర్లు దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల మేరకు హెచ్‌ఎంలు ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్స్ నలుగురు, ఎస్‌జీటీలు ఇద్దరు చొప్పున కేడర్ల వారీగా వడపోసి రాష్ట్రశాఖకు పంపాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో అవార్డులకు దరకాస్తు చేసుకున్న టీచర్లను శనివారం విద్యాశాఖ నియమించిన త్రిసభ్యకమిటీ (డిప్యూటీ డీఈఓలు మల్లారెడ్డి, శ్రీనివాసరావు, డైట్ మాజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ) డీఈఓ ఆఫీస్‌లో ఇంటర్వ్యూ చేసింది. ఈ ఇంటర్వ్యూలలో ఆయా సబ్జెక్టులలో టీచర్ల ప్రతిభ, పాఠశాలల అభివృద్ధికి చేసిన కృషి, ఇతర సామాజిక సేవలు తదితర అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నిబంధనల మేరకు 8మందిని ఎంపిక చేసి రాష్ట్రశాఖకు పంపారు. రాష్ట్రస్థాయిలో మరో బృందం వీరికి మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేస్తుందని డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి తెలిపారు.

అనంతపురం, కర్నూలు జట్ల విజయం


నేహా


శిరీషా


చక్రిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్‌జోన్ క్రికెట్ పోటీల్లో అనంతపురం, కర్నూలు జట్లు గెలుపొందాయి. శనివారం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం, నెల్లూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 38.5 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతపురం బౌలర్ చక్రిక దండు 3వికెట్లు తీసింది. అనంతరం బరిలోకి దిగిన అనంతపురం జట్టు 17.4 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. బ్యాటర్ నేహ 56 పరుగులతో నాటౌట్‌గా నిలవగా, అర్షియా 46 పరుగులు చేసింది. కీలక 3వికెట్లతో రాణించిన చక్రిక దండు నెల్లూరు జట్టును మట్టి కరిపించి అనంతపురం జట్టు 9వికెట్ల తేడాతో గెలుపొందడంలో కీలకపాత్ర పోషించింది. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కడప, కర్నూలు మధ్య జట్ల పోరులో...మొదట బ్యాటింగ్ చేసిన కడప 49.3 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బ్యాటర్ శిరీషా 94 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కర్నూలు 37.5 ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 196 పరుగులు చేసి గెలుపొందింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి, సెలెక్షన్ కమిటీ ఛైర్‌పర్సన్ సల్మాభాను, సెలెక్టర్ ధనలక్ష్మి, రాధిక, వేదవల్లి, నాగమణి, అనూషా, హరీషా పోటీలను పర్యవేక్షించారు.

డైట్‌లో అడ్మిషన్లకు స్పందన కరువు

బుక్కపట్నం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో చేరే విద్యార్థులు కరువవుతున్నారు. ఉమ్మడి జిల్లాకు బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో రెండువందల సీట్లు ఉన్నాయి. ఇప్పటికి 120మంది మాత్రమే అడ్మిషన్లు పొందారు. మరో 80సీట్లు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన సీట్లలో విద్యార్థులు చేరడానికి ఆదివారం ఆఖరి తేదీగా అధికారులు నిర్ణయించారు. ఒకప్పుడు సీటు సంపాదించాలంటే కష్టంగా ఉండేది. ప్రస్తుతం ఈ కళాశాలలో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపడంలేదు.

15 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): 15 మండలాల్లో శనివారం వర్షం పడింది. వజ్రకరూరులో 52.0 మీ.మీ, తాడిపత్రి 31.4, పెద్దవడుగూరు 29.6, యాడికి 19.2, విడపనకల్లు 16.2, గుత్తి 10.8 మీ.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 8.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. పుట్లూరు మండలంలో మోస్తారు వర్షం కురవగా.. విడపనకల్లు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

న్యూస్ బాక్స్

సామూహిక ఏడు శనివారాల వ్రతం



వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ఏడు శనివారాల వ్రతాన్ని ఆరో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు రాజేశ్ మూలవిరాట్‌కు పూజలు చేశారు. అనంతరం మహిళలు వ్రతాన్ని ఆచరించారు.

'స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే ధ్యేయం'



బత్తలపల్లిలో శుద్ధి జల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సతీమణి త్రివేణి

బత్తలపల్లి/తాడిమర్రి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ సతీమణి త్రివేణి పేర్కొన్నారు. మండలంలోని గరశనపల్లిలో శనివారం హిందుస్థాన్ కోకాకోలా బేవరేజెస్ సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధి జల కేంద్రాన్ని ఆమె ప్రారంభించి, మహిళలకు నీటి బిందెలను అందించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్, బీజేపీ నాయకుడు వీరనారప్ప, నాయకులు సురేంద్రనాయుడు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తాడిమర్రి మండలంలోని పిన్నదరి గ్రామంలో ఆమె ఆర్వో ప్లాంటు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రికుమారుడు రిషి అద్వాని, టీడీపీ మండల కన్వీనర్ కూచిరాము, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, విశ్వనాథ్, బీజేపీ నాయకులు అంబటి సతీశ్, బీజేపీ మండల అధ్యక్షుడు రాము, ఉపాధ్యక్షుడు పిన్నదరి రమణ, నాగార్జున, ఆనంద్‌తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: ఆర్డీఓ

బత్తలపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మహేష్ తెలిపారు. మండలపరిధిలోని చిత్రావతి నదిని ఆయన శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. మండలంలోని చిత్రవతి నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని, ఇక్కడి నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ స్వర్ణలత, వీఆర్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అవయవాల్లో నేత్రాలే ప్రధానం: మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మన అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని, అవే మన జీవితాలకు వెలుగులని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జగరాజుపల్లిలో శనివారం ప్రభాత్‌రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆసొసైటీ ప్రతినిధి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని మాజీ మంత్రి ప్రారంభించారు. బెంగళూరుకు చెందిన మంజునాథ నేత్రాలయం సహ కారంతో ఏర్పాటుచేసిన శిబిరంలో 127 మందికి కంటి పరీక్షలు నిర్వహించింది. 37 మందిని మెరుగైన కంటిపరీక్షల కోసం మంజునాథ నేత్రాలయానికి సిఫారసు చేసినట్లు వైద్యులు తెలిపారు.

టీడీపీ నాయకుడికి ఘన నివాళి



కోట్ల రమణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాత ఊరికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కోట్ల రమణ ద్వితీయ వర్ధంతిని ఆయన కుమారుడు కోట్ల బాబి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. టీడీపీ మండల నాయకులు కోట్ల రమణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి నివాళి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మాజీప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని బీజేపీ స్థానిక కార్యాలయంలో ఆ పార్టీనాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి హరికృష్ణ, అధికార ప్రతి నిధి జ్యోతిప్రసాద్, సురేంద్రబాబు, సాకే రామాంజినేయులు, నారాయణ, లక్ష్మీనారాయణనాయక్, మధుసూదన్ పాల్గొన్నారు.

ఘర్షణలో నలుగురికి తీవ్రగాయాలు

ధర్మవరం రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్కాపురం గ్రామంలో ఒక వర్గానికి చెందిన రెండు పొట్టేళ్లు వేరే వర్గానికి చెందిన మందలోకి వెళ్లాయి. వాటి విషయమై శనివారం రాత్రిజరిగిన ఘర్షలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లాపురానికి చెందిన హరికృష్ణ, ఈశ్వరయ్య తమ గొర్రెలను గ్రామ సమీపంలోని వంక వద్దకు రెండురోజుల క్రితం మేపుకోసు తీసుకెళ్లారు. వారి రెండు పొట్టేళ్లు మరొక వర్గమైన బిల్లే రామచంద్ర, నాగరాజు, కాటమయ్యకు చెందిన మందలోకి వెళ్లాయి. గమనించిన హరికృష్ణ, ఈశ్వరయ్య మీ మందలోకి మా పొట్టేళ్లను తమకు ఇవ్వాలని అడిగారు. ఈ క్రమంలో ఆ రెండు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింగి. దీనిపై గ్రామంలో పంచాయతీ పెడదాం అంటూ అక్కడి నుంచి బయలుదేరారు. గ్రామంలోకి రాగానే రామచంద్ర, నాగరాజు, కాటమయ్యకట్టెలు, రాడ్లతో ఒక్కసారిగా హరికృష్ణ, ఈశ్వరయ్య, ఈశ్వరయ్య భార్య కాటెమ్మపై దాడులకు దిగారు. ఈ దాడుల్లో హరికృష్ణ, ఈశ్వరయ్య, కాటెమ్మ తీవ్రంగా గా యపడ్డారు. వారిని గ్రామస్థులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తర లించారు. ఎదురుదాడిలో నాగరాజు గాయపడ్డాడు. రూరల్ పోలీ సులు గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. హత్యాయత్నం చేసేం దుకు కట్టెలు, రాడ్లతో దాడులు చేశారని బాధితులు ఇచ్చిన ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు వర్గాల ఘర్షణ

నల్లమాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో శనివారం రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. గ్రామానికి చెందిన జనార్దన్ అనే వ్యక్తికి తేజ అనే వ్యక్తి రూ. 30వేలు అప్పు ఇచ్చి పత్రం రాయించుకున్నాడు. ఆ డబ్బు తిరిగి చెల్లించాలని జనార్దన్‌ను తేజ అడిగాడు. అయితే తరచూ డబ్బులు అడుగతావా అని జనార్దన్, వినోద్, నరసింహ, కిషోర్ నలుగురు కలిసి తేజ, మరో ముగ్గురిపైపై కట్టెలతో దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఏడుగురిపై కేసున మోదుచేశామని స్థానిక సీఐ నరేంద్రరెడ్డి తెలిపారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనాలు





నిరుపయోగంగా ఉన్న హాస్టల్ భవనాలు

● చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు నిలయాలుగా మారుతున్న వైనం

తనకల్లు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలో రాచువారిపల్లికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆ రువైపుల ప్రభుత్వం వివిధ హాస్టల్ భవనాలను నిర్మించింది. బీసీ బాలికల, ఎస్సీ బాలిక, బాలుర, ఎస్టీ బాలుర హాస్టళ్లను రూ. కోట్లు ఖర్చు చేసి గతంలో నిర్మించారు. వాటికి ప్రహరీ నిర్మించి, గేట్లు ఏర్పాటు చేయడంతో పాటు పూర్తి మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. దీంతో మండలం నుంచే కాకుండా నల్లచెరువు, అమడగూరు, గాండ్లపెంట, నంబులపూలకుంట నుంచి, సమీప అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లి, బురకాలయకోట, ప్రాంతాల నుంచి వందలాది మంది బాల బాలికలు ఈ హాస్టల్లో సీట్లు సంపాదించి, చదువుకునే వారు. అయితే ఉన్న ట్లుండి హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవ డంతో పదేళ్ల క్రితం ఎస్సీ బాలుర హాస్టల్‌ను మూసివేశారు. క్రమంగా ఎస్సీ బాలికల, ఎస్టీ బాలుర హాస్టల్‌ను మూసివేశారు. గత యేడాది వరకు కొనసాగిన బీసీ బాలికల హాస్టల్‌ను ఈ యేడాది మూసివేశారు. దీంతో రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భవనాలు ఖాళీగా ఉన్నాయి. అవి కాస్త చట్టవ్యతిరేక కార్య కలాపాలకు కేంద్రాలుగా మారిపోయాయని ఆ దారి వెంట వెళ్లే పలు గ్రా మాల ప్రజలు వాపోతున్నారు. రూ. కోట్లు విలువ చేసే భవనాలను అలా గాలికొదిలేసి, కొత్త భవనాల నిర్మాణంలో ప్రభుత్వం నిమగ్నమండం ఎందుకో అర్థంకావడం లేదని అంటున్నారు. తనకల్లు గ్రామ సచివాల యం-1ని చాలీచాలని భవనంలో, సచివాలయం -2ను అద్దె భవనంలో నిర్వ హిస్తున్నారు. వృథాగా పడి ఉన్న ప్రభుత్వ భవనాలను ఉపయోగించుకోకుండా... అధికారులు ఇలా ఎందుకు నిర్వహిస్తున్నారో అని ప్రశ్నిస్తున్నారు. చిన్న చిన్న మండలాల్లో సైతం హాస్టళ్లు కొనసాగు తుండగా, జిల్లాలోనే అది పెద్ద మండలంగా పేరున్న తనకల్లులో ఒక్క హాస్టల్ కూడా లేకపోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా సంబంధితాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తనకల్లులో ని హాస్టళ్ల భవనాలను గ్రామ సచివాలయాకు గానీ, కదిరిలో నిర్వహిస్తున్న ఎస్టీ బాలికల కళాశాలకు కానీ ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

నిరుపేదలకైనా ఇళ్లు కేటాయించండి



మండలంలో నిరుపయోగంగా మారిన హాస్టల్ భవనాలను ప్రభుత్వ అవసరలకు వినియో గించుకోలేకపోతే, నిరుపేదలైన ఇళ్లు లేనివారికి వాటిని అప్పగించాలి. రూ.కోట్లు విలువ చేసే భవనాలు, భూ ములు, వృథాగా ఉండడం మంచిదికాదు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు నిలయాలుగా మారడం ప్రమాదకరం. ఈ విషయంలో ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

- వీవీ రమణ, రైతుసంఘం నాయకుడు

ప్రభుత్వ ఆస్తులను కాపాడేవారే లేరా ?



కాంగ్రెస్ పాలనలో రూ.కోట్లు ఖర్చుచేసి. ఎస్సీ, ఎస్టీ, బీసీ బాల బాలికల కోసం ప్రభుత్వ హాస్టళ్లు నిర్మించింది. అలాంటి హాస్టళ్లు నేడు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారిపోయాయి. ఈ ఆస్తులను సంరక్షించాల్సిన బాధ్యత అధికారులకు లేదా? ఆ భవనాలను ప్రభుత్వం కార్యాలయాలకు ఉపయోగించుకోవాలి.

- పారేసు, కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్



ముదిగుబ్బలో పూజలు చేస్తున్న మంత్రి సత్యకుమార్



ధర్మవరం ఇస్కాన్ మందిరంలో జగన్నాథుడు, సుభద్ర, బలరాముడు



నల్లచెరువు గీతామందిరంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో జగన్నాథ, సుభద్ర, బల రామ ప్రతిమలను ఇస్కాన్ ధర్మవరం ధర్మప్రచారకులు శ్రీకృష్ణ మాధవ దాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణలతో అలరించారు. పెద్దఎత్తున పట్టణ, గ్రామీణవాసులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే ఇస్కాన్ సంస్థాపనాచార్యులు శ్రీల ప్రభుపాదుల ప్రతిమకు విశేషపూజలు చేశారు. అలాగే మండలంలోని గొట్లూరులో వెలసిన వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే 'స్థానిక లక్ష్మీ చెన్న కేశవస్వామి ఆలయం వద్ద ప్రబోధసేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటుచేసి పూజలు చేశారు. యాదవవీధి, కొత్తపేటలోని గీతా మందిరంలో శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కొత్తపేట గీతామందిరంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పూజలు చేయించారు. చెన్నకేశవస్వామి ఆలయంలో రుక్మిణీసమేత శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. కొత్తచెరువులోని గుప్పుల కాలంనాటి వేణు గోపాలస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు అర్చకులు భాస్కర్‌రాజేశ్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భజనలు చేశారు. ప్రబోధానంద సేవాసమితి వారు శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటుచేసి పూజలు చేశారు. గాండ్లపెంట మండల వ్యాప్తంగా కృష్ణామి వేడుకలను ఘనంగా నిర్వహించా రు. వేపకుంట గ్రామంలో కృష్ణుడి విగ్రహాన్ని ఊరే గించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషాధారణలో అల రించారు. బ త్తలపల్లి మండలవ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నా రు. ఓబుళదేవరచెరువు మండల వ్యాప్తంగా కృష్ణాష్టమిని మండల వ్యా ప్తంగా నిర్వహించారు. అలాగే ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను గ్రామంలో ఊరేగించారు.

● ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేయించారు. పండుగలు మన సంప్రదాయాల గౌరవాన్ని నిలబెట్టడమే కాకుండా, సామాజిక ఐక్యతకు దోహదపడుతాయని మంత్రి పేర్కొన్నారు.

● నల్లచెరువు: మండలకేంద్రంలోని గీతామందిరంలో శనివారం శ్రీకృష్ణుడి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలను సమర్పించారు. ఈ పూజలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఎమ్మెల్యేని ఆలయ కమిటీ చైర్మన్ దాదెం శివారెడ్డి, కన్వీనర్ రాజశేఖర్‌బాబు దుశ్శాలువ, పూలమాలతో సన్మానించారు.



ధర్మవరం గీతామందిరంలో పాల్గొన్నచిలకం





ధర్మవరం యాదవవీధి, గొట్లూరులో శ్రీకృష్ణుడు



వేపకుంటలో కృష్ణుడి విగ్రహం ఊరేగింపు

పాఠశాలల్లో....



ఉషోదయ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

ధర్మవరం/కదిర అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో ఉన్న ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. చిన్నారులతో ఉట్టికొట్టించడం, గోపికలతో వెన్నచిలికించడం వంటి ఘట్టాలను నిర్వహించారు. అలాగే కదిరి పట్టణంలోని పట్టణంలోని షిర్డీసాయి హైస్కూల్‌లో. చిన్నారులు శ్రీకృష్ణుడు, బలరాముడు, రాధ, రుక్మిణి, సత్యభామ, గోపికల వేషధారణలో హాజరయ్యారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి.



కదిరి షిర్డీసాయి హైస్కూల్‌లో నృత్యం చేస్తున్న చిన్నారులు

● నంబులపూలకుంట / ఓబుళదేవర చెరువు: నంబులపూలకుంట మండలకేంద్రంలోని కేజీబీవీలో బాలికలు గోపికల వేషాధారణలో అలరించారు. ఓబుళదేవరచెరువు మండల వ్యాప్తంగా కృష్ణాష్టమిని మండల వ్యాప్తంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని వశిష్ఠ, జ్ఞానసాయి, విజ్ఞాన్, శ్రీవిజ్ఞాన్, రెయిన్‌బో పాఠశాలల్లో గోపికలు, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు అలరించారు.



ఎన్పీకుంట కేజీబీవీలో గోపికల వేషధారణలో బాలికలు



ఓబుళదేవర చెరువులో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో...

'ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'



నినాదాలు చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిస్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం విశేషకృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, పాలేల రామాంజినేయులు పేర్కొన్నారు. సంఘానికి గుర్తింపు వచ్చి ఆరేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా జిల్లాకేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం సంఘం జెండాను ఆవిష్కరించి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి గ్రూప్-1 అధికారుల వరకు అన్ని కేడర్ల ఉద్యోగులు సంఘంలో కొనసా గుతున్నారన్నారు. ఉద్యోగులకు ఎలాంటి సమస్యలొచ్చినా సంఘం దృష్టికి తీసుకొచ్చినవెంటనే వాటిని పరిష్కరిస్తామ న్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గోవిందప్ప, రవి, ముసలిరెడ్డి, సహాయ కార్యదర్శి కిశోర్, వివిధ తాలుకాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఏలను వెంటనే ప్రకటించాలి

● కదిరి అర్బన్: ప్రభుత్వ నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆది బయ్యన్న డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎన్జీఓ కార్యాలయంలో ఏపీటీఎఫ్ సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టియేడాదిన్నర అయినా పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయలేదన్నారు. వెంటనే పీఆర్సీ కమిటీని ప్రకటించి, 30శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. ఐదేళ్లుగా పెడింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. నాయకులు నారాయణ, జనార్ధన్, పి.నారాయణ, భోజనం శ్రీనివాసులు, బండారు గంగాధర్, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శనివార పూజలు



పాలపాటిన్నెలో ఆంజనేయస్వామి

నల్లచెరువు, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాసం నాలుగో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామిని దర్శించుకోవ డానికి ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. తనకల్లు, నల్లచెరువు మండలాలకు చెందిన టీడీపీ నాయకులు రమణనాయుడు, కావడి ప్రవీణ్ కుహర్ అన్నదానం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.



గొట్లూరు ఆంజనేయస్వామి

ధర్మవరం రూరల్ /గాండ్లపెంట/ నల్లమాడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో వెలసిన ఆంజనే యస్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ మూలవిరాట్‌కు ఆకుపూజ, తదితర పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన దాతలు చలసాని జయమ్మ, వెంకటేష్ కుమారుడు చలసాని రవికుమార్, రాధిక దంపతులు అన్నదానం చేశారు. అలాగే గాండ్లపెంట మండలం మునగలవారిపల్లిలో ని గరుడాంజనేయ స్వామికి, నల్లమాడ మండలం పెద్దకోటపల్లిలో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోరాటయోధుడు గౌతు లచ్చన్న: పల్లె



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు గౌతు లచ్చన్న బడుగు బలహీన వర్గాల కోసం అనేక పోరాటాలు చేశారని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. లచ్చన్న సాహసానికి, కార్యదీక్షతకు మెచ్చి ప్రజలే సర్దార్ అనే బిరుదును ఆయనకిచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు పీసీ గంగన్న, బెస్త చలపతి, నాయకులు గంగాధర్‌నాయుడు, శ్రీరాములు, శ్రీరామిరెడ్డి, ఓబులేసు, రమేష్, సూరి పాల్గొన్నారు.

ఈడిగ సాధికార సమితి నాయకుల హర్షం

కదిరి అర్బన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని అధికారికంగా నిర్వహించడంపై ఈడిగ సాధికారిక సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు శనివారం పట్టణంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆయన జయం తిని అధికా రికంగా నిర్వహించడంతో సీఎం చంద్రబాబుకు కృతజ్ఞ తలు తెలి పారు. నాయకులు మనోహర్‌గౌడ్, నాగేంద్రగౌడ్, రామాంజిగౌడ్, సరోజమ్మ, శంకరప్పగౌడ్, బాబుగౌడ్ తదితరులు ఉన్నారు.

పింఛన్ ఇప్పించాలని దివ్యాంగురాలి వినతి

నల్లచెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ పింఛన్ తిరిగి ఇప్పించాలని మండలకేంద్రానికి చెందిన మణెమ్మ అనే దివ్యాంగురాలు శనివారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. నల్లచెరువుకు వచ్చిన ఎమ్మెల్యేని ఆమె కలసి తన గోడు వినిపించారు. తనకు దాదాపు 20యేళ్ల నుంచి దివ్యంగ పింఛన్ వస్తోందని, తనిఖీల్లో భాగంగా అధికారులు నిర్లక్ష్యంగా తనకు నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయంచేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో చర్చించి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండలకేంద్రంలో శనివారం టీడీపీ మండలాధ్యక్షురాలు సుబాషిణి, నాయకురాలు వాల్మీకి నాగవేణి ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి, థ్యాక్యూ సీఎం అంటూ నినాదాలుచేశారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు అఖిల, స్వర్ణ, కూమారి, అశ్విని, గౌసియా తదితరులు పాల్గొన్నారు.



కొక్కంటి క్రాస్‌లో క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

● తనకల్లు : మండలపరిధిలోని కొక్కంటి క్రాస్‌లో శనివారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్రపటాలకు మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఎన్నికలత్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించినందుకు కృతజ్ఞతగా క్షీరాభిషేకం చేసినట్లు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు సోంపాల్యం నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు శారద, రాణి, సుజాత, భారతి, లక్ష్మీదేవి, వెంకటరమణమ్మ, మాలతి, పలువురు మహిళలు, నాయకులు జయకుమార్‌నాయక్, వెంకటరమణ, పులి మహేష్, వేణుగోపాల్ నాయుడు, చిన్న గోవిందు, నాగరాజు, పూల రమేష్, లక్ష్మణ, జిలేబి వెంకటరమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

వంకపై ఆక్రమణల తొలగింపు



వంకపై ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

సోమందేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధనలక్ష్మీ రోడ్డులో వంకపై ఆక్రమణలను తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు ప్రారంభించారు. కొన్నేళ్లుగా వంకను ఆక్రమించి మెటికలు, బాత్రూంలు నిర్మించుకున్నారు. గత యేడాది ఇది వివాదాస్పదంగా మారింది. సమస్య ఎంపీడీఓ వెంకటలక్ష్మీ దృష్టికి రావడంతో స్పందించిన ఆమె సర్వేచేయించాలని ఈఓఆర్డీని ఆదేశించారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆక్రమణదారులకు నోటీసులు అందించాలని పంచాయతీవారిని ఆదేశించారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకునేందుకు గడువు విధించారు. అయితే ఎవరూ స్పందించకపోవడంతో శనివారం అధికారులు చెప్పిన విధంగానే ఎక్స్‌కావేటర్‌తో ఆక్రమణలు తొలగించడం ప్రారంభించారు. కార్యదర్శి రామాంజినేయులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగిస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు. సర్వేరిపోర్ట్ రాగానే దాని ఆధారంగా వంకపై చేపట్టిన అన్ని ఆక్రమణలు దశలవారీగా తొలగిస్తామన్నారు.

జయప్రదం చేయండి: సీపీఐ



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

సోమందేపల్లి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ 28వ మహాసభలు జయప్రదం చేయాలని మండల కన్వీనర్ రాజగోపాల్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని పాత హైస్కూల్ ఆవరణంలో అనుబంధ సంఘాల నాయకులతో కలిసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 20 నుంచి 25 వరకు ఒంగోలు పట్టణంలో మహాసభలు జరుగుతాయన్నారు. పార్టీసభ్యులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలాస్వామి, మండల నాయకులు అంజినమ్మ, గంగరాజు, చంద్రశేఖర్, బాబాజాన్, నూర్జహాన్, నారాయణస్వామి పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తి

- ఈడిగ సంఘం నాయకులు



జయంతి వేడుకల్లో నాయకులు

పెనుకొండ టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రైతు ఉద్యమకారుడు సర్దార్ గౌత్ లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని ఈడిగ (గౌడ) సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో 116వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతిని జరపడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, గిరిధర్‌గౌడ్, కన్వీనర్ శ్రీరాములు, గోపాల్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయ జీర్ణోద్ధరణకు నగదు విరాళం



నగదును వితరణ చేస్తున్న పూల చలపతి కుటుంబ సభ్యులు

గోరంట్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వానవోలు వద్ద వెలసిన కస్తూరి రంగనాథస్వామి ఆలయ జీర్ణోద్ధరణ శనివారం పలువురు నగదును వితరణ చేశారు. పెట్లగుంటపల్లి పూల వెంకటరమణమ్మ, చలపతి కుటుంబ సభ్యులు రూ. 50,116లు విరాళం అర్చకులు శ్రీధర్‌స్వామికి అందించారు. అదేవిధంగా అనంతపురానికి చెందిన బట్రోతు చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు రూ.35,116లు, పెనుకొండ మండలం వెంకటరెడ్డిపల్లికి చెందిన రామాంజనమ్మ కుమారులు రూ30,116 నగదును కమిటీకి అందించారు.

రక్షాబంధన్ వేడుకలు



రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్న మౌనిక

రొద్దం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఓంశాంతి నిర్వాహకులు రక్షాబంధన్ వేడుకలను మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. శనివారం రొద్దంలోని ప్రభుత్వ ఆసుపత్రి, టీచ్‌కాన్వెంట్, మదర్‌టెక్నో పాఠశాల, గ్రామస్థులకు ఓంశాంతి నిర్వాహకురాలు మౌనిక రాఖీ కట్టి సోదరభావాన్ని తెలియజేశారు. ప్రతియేడాది రక్షాబంధన్ వేడుకలు నిర్వహిస్తూ ప్రజలపట్ల సోదరభావాన్ని పెంపొందిస్తున్నామన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గుత్తిరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేటలో వెలసిన నవ అహోబిల లక్ష్మీనరసింహస్వామికి, తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ శనివారం కావడంతో స్వామి వారికి వేకువజామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహా మంగళ హారితినిచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్తులపై అధికారం.. ఇదే అవకాశం

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు వీలు
దరఖాస్తుకు గడువు పొడిగింపు
సగం లే అవుట్లు అనధికారికమే



పట్టణ సమీపంలో అనధికారికంగా వేసిన లేఅవుట్

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువు పొడిగించింది. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరణ పరిధిలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పురపాలకశాఖ డైరెక్టర్ కమిషనర్లకు ఆదేశాలు ఇచ్చారు. ఇప్పటి వరకు అనధికార లేఅవుట్లలో ఉన్న ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకోవాలని సూచించారు. వైసీపీ హయాంలో విరివిగా లేఅవుట్లు వెలిశాయి. హిందూపురం పట్టణపరిధిలో అనుమతులు లేని లేఅవుట్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. అయితే ఇవన్నీ మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోపాటు కొన్ని అనుమతులు కూడా తీసుకోలేదు. అయితే లేఅవుట్లలో అధికశాతం మంది వ్యక్తిగత ప్లాట్లుగా కొనుగోలుచేశారు. దీంతో స్థిరాస్తి వ్యాపారులు ఎవరెవరికి ప్లాట్లు అమ్మారనే వివరాలు ఇటీవల సేకరించి నోటీసులు కూడా ఇవ్వడానికి మున్సిపల్ అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో అలాంటి ప్లాట్లు క్రమబద్ధీకరణకు వీలుగా దరఖాస్తుకు గడువు పొడిగించారు.

ప్రభుత్వానికి ఆదాయం

అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారికి ఇల్లు నిర్మించుకోవాలంటే ప్లాన్ తీసుకునే సమయంలో స్థానిక సంస్థకు అక్కడ విలువతో 14శాతం అదనంగా ఫీజు చెల్లించాలి. అంతేకాక డెవలప్‌మెంట్, ఇతరత్ర ఫీజులు ఉంటాయి. ఉదాహరణకు అనధికార ప్లాటులో బిల్డింగ్ ప్లాన్ పొందాలంటే రూ.లక్ష దాకా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అదే క్రమబద్ధీకరించుకుంటే రూ.50వేలు ఖర్చవుతుంది. వెంటనే చేయించుకున్నవారికి ప్రోత్సాహకాలు కూడా ప్రకటించే అవకాశం ఉంది.

మూడు నెలల్లోపు..

క్రమబద్ధీకరణ గడువును జూలై 26 నుంచి 90 రోజుల్లోపు దరఖాస్తు చే సుకునే అవకాశం కల్పించారు. అనధికార లేఅవుటులో ప్లాట్లు ఉన్నవా రు, లేఅవుట్‌వేసినవారు 2020 ఎల్ఆర్ఎస్ సమయంలో దరఖాస్తు చే యనివారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసేటప్పుడు ఈయేడాది జూన్ 30కు ముందు సేల్స్ అట స్టైడ్ డాక్యుమెంట్ లే అవుట్ స్కెచ్ సమర్పించాలి. ప్లాటు జూన్ 30 లోపు రిజిస్ట్రేషన్ అయి ఉండాలి.

మంచి అవకాశం

ప్రభుత్వం అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసినవారు వెంటనే దరఖాస్తు చేసుకుంటే వారికి ఎంతో ప్రయోజనం ఉంటుంది. వచ్చేనెల 19 లోపు మొత్తం నగదు చెల్లిస్తే క్రమబద్ధీకరణకు పది శాతం రాయితీ కూడా అందవచ్చు. అయితే ఈ యేడాది జూన్ 30లోపు ఏర్పాటు చేసిన అనధికార లేఅట్లలో ప్లాట్లు కొన్నవారు క్రమబద్ధీకరించుకోవాలి.

- మల్లికార్జున, కమిషనర్

గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

రోడ్డుపైనే వర్షపు నీటి నిల్వ
ప్రబలుతున్న విషజ్వరాలు
ఫాగింగ్ చేయాలంటున్న గ్రామస్థులు



జమ్మానిపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

మడకశిర రూరల్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. వారం రోజులుగా ఓ మోస్తరుగా వర్షం కురుస్తోంది. దీంతో దోమలు రాత్రి పూట ప్రజల కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో విషజ్వరాలు పెరిగి ఆసుపత్రులకు రోగులు పరుగు తీస్తున్నారు. మండలంలో 16 పంచాయతీలు 110 గ్రామాలు ఉన్నాయి. గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో మురుగు నీరు రోడ్లపై నిల్వ ఉంటోంది. మరి కొన్ని గ్రామాల్లో సరియైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయని గ్రామస్థులు అంటున్నారు. రాత్రి వేళల్లో దోమలు విజృంభిస్తున్నాయని, కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయంటున్నారు.

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

దోమల నియంత్రణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాలు గ్రామ సచివాలయాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. నిధులు కొరత కారణంగా సర్పంచులు, గ్రామ కార్యదర్శులు ఫాగింగ్ చేయడం లేదన్న ఆరోపణలు బహిరంగంగానే ఉంటున్నాయి. ఉన్న నిధులను తాగునీరు, బోర్లకు సంబంధించి మరమ్మతులు, పైప్‌లైన్లకు ఉపయోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. అయితే వర్షాకాలంలో ఫాగింగ్ కచ్చితంగా చేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించాలని, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఫాగింగ్ చేయాలి

గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలకుండా దోమలను అరికట్టాలి. ఇందుకు క్రమంతప్పకుండా ఫాగింగ్ చేయాలి. పారిశుధ్య చర్యలు చేపట్టాలి. బ్లీచింగ్ చల్లాలి.

- వేమారెడ్డి, రైతు పాపసానిపల్లి

చర్యలు తీసుకుంటాం

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు తగు సూచనలు ఇచ్చాం.

-సోనీబాయ్, ఎంపీడీఓ, మడకశిర

కార్యవర్గం ఎంపిక



పంచాయతీరాజ్ ఉద్యోగుల తాలూకా నూతన కార్యవర్గం

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం హిందూపురం తాలూకా అధ్యక్షుడిగా జూనియర్ అసిస్టెంట్ రియాజ్‌ను ఎన్నుకున్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఉద్యోగులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హిందూపురం తాలూకా అధ్యక్షుడిగా రియాజ్, ఉపాధ్యక్షులుగా గోవిందరాజు, ప్రధాన కార్యదర్శిగా చౌళూరు జడ్పీహెచ్ఎస్ జూనియర్ సహాయకులు అమృతరావు, సంయుక్త కార్యదర్శిగా లేపాక్షి కుల్లాయప్ప, కోశాధికారిగా సంతేబిదునూరు ఉన్నత పాఠశాల జూనియర్ సహాయకులు విద్యావతి, జిల్లా కౌన్సిలర్‌గా బాబు, నాగమణిలను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా డిప్యూటీ ఎంపీడీఓ శివకుమార్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశీలకులు శ్రీనివాసులు, నందకిషోర్, హరిబాబు, రాంకిషోర్, అల్లాబకష్, మల్లికార్జున పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలం మలుగూరు గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు విషజ్వరాలతో బాధపడుతూ హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థుల ఆరోగ్యంపై ఆరాతీశారు. వారి తల్లిదండ్రులకు వైరల్ జ్వరాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పాఠశాల ఆవరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

రెడ్ ఆర్మీ జనసేవాదళ్ శిక్షణ

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో రెడ్ ఆర్మీ జనసేవాదళ్ శిక్షణా కార్యక్రమం హిందూపురంలో శనివారం జరిగింది. ఎంజీఎం క్రీడా మైదానంలో రెడ్ ఆర్మీ సభ్యులు మార్చ్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర జనసేవాదళ్ కన్వీనర్ మురళి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 25 వరకు ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వీటికి రెడ్ ఆర్మీ వలంటీర్లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్, ఎస్ఎఫ్ఐ నాయకులు నరసింహమూర్తి, కమల్‌బాష, ఇస్మాయిల్‌బాష తదితరులు పాల్గొన్నారు.ట

వాసవీమాతకు
పసుపుకుంకుమ అలంకరణ

పెనుకొండ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వాసవీ మాతను పసుపుకుంకుమతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం గావించారు.



శనైశ్చరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

పావగడ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): చరిత్ర ప్రసిద్ధిచెందిన పావగడ శీతలాంబ, జేష్టాదేవి సమేత శనైశ్చర స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. శ్రావణమాసం నాల్గవ శనివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై తైలాభిషేకం, నవగ్రహ పూజ, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దావణగిరి, చిత్రదుర్గం, బళ్లారి, అనంతపురం, కళ్యాణదుర్గం నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 50వేల మందికి పైగా భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ తెలిపారు.

● పట్టణానికి సమీపంలో ఉన్న కురుబరహళ్లి గేటులో వెలసిన దేవగిరి వెంకటేశ్వరస్వామికి నాలుగవ శ్రావణశనివారం సందర్భంగా ప్రత్యేకంగా వెన్నతో అభిషేకం చేశారు. ఉదయం నుంచి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

అంజన్నకు ప్రత్యేక పూజలు



అగళి, గుడిబండలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ

శ్రావణమాసం నాల్గవ శనివారం సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, అర్చనల అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. లేపాక్షి, అగళి, గుడిబండ తదితర ప్రాంతాల్లోని ఆలయాల్లో స్వామివారికి పూజలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌నెట్‌వర్క్, (ఆంధ్రజ్యోతి)

పాఠశాలకు కుర్చీల వితరణ

పెనుకొండ టౌన్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి) :మండలంలోని వెంకటరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడు నారాయణస్వామి ఆరు కుర్చీలను వితరణగా అందించారు. శనివారం స్థానిక పాఠశాలలో హెచ్ఎంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంజుళ, అంజినప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.



కుర్చీలు అందజేస్తున్న నారాయణస్వామి

ఘనంగా కృష్ణాష్టమి

కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజలను అర్చకులు చేశారు. అనంతరం స్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరణ చేశారు. భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులుతీరారు.



ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాధాకృష్ణులు

హిందూపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణజన్మాష్టమి పురస్కరించుకుని హిందూపురంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. శనివారం పట్టణంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం కల్యాణోత్సవం, మధ్యాహ్నం బ్రహ్మరథోత్సవం జరిగింది. వేణుగోపాలస్వామి ఆలయంలో పెద్దఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. చిన్నమార్కెట్ నుంచి బెంగళూరు రోడ్డుమీదుగా బ్రహ్మరథోత్సవం సాగింది.

ఇస్కాన్ ఆధ్వర్యంలో..

బెంగళూరు ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకుని సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక మండపం ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చిన్నారులు కృష్ణుడి వేషధారణతో ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



పెనుకొండలో.. యాదవసంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకలను యాదవ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణగావించారు. అనంతరం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక రథంలో అలంకరించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములుయాదవ్, రమణమ్మ, బాబుల్‌రెడ్డి, చంద్రకాంతమ్మ, సాయిప్రసాద్, ప్రభంజన్‌కుమార్ పాల్గొన్నారు.



మడకశిర రూరల్.. స్వామివారు, దర్శించుకుంటున్న తిప్పేస్వామి

మడకశిర రూరల్, (ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమిని పురస్కరించుకుని వేణుగోపాలస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఎల్లోటి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అగళి.. పూలపల్లిలో వేడుకల్లో పాల్గొన్న గ్రామస్థులు

అగళి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలపల్లి గ్రామంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులు మోశారు. ప్రత్యేక పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అమరాపురం.. గంగ పూజ నిర్వహిస్తున్న గ్రామస్థులు

అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వలస, అమరాపురం, ఉదుగూరు గ్రామాలలో శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా ఉదయం 6గంటల నుంచి గంగపూజ, గోపూజ కార్యక్రమాలు యాదవ యువక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



గోరంట్ల.. స్వామివారు, కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): కొండాపురం, మేరెడ్డిపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. మల్లాపల్లిని గోకులాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి శంకర్‌నారాయణ పాల్గొన్నారు. గోరంట్లలోని పాత స్టేట్‌బ్యాంక్ వద్ద ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేశారు. శ్రీమాధవరాయ ఆలయంలో పురోహితులు భాస్కర్‌తారానాథ్ శర్మ ఆధ్వర్యంలో రాధ, మాధవుల కల్యాణోత్సవం జరిగింది. కార్యక్రమంలో నిమ్మల విద్యాధరణీ, నిమ్మల చంద్రశేఖర్, బీజేపీ వేదవ్యాస్, దేవిస్వామి, నాగరాజు, హరి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

● పెనుకొండ టౌన్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్లాపురంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఉత్సవ విగ్రహం ఊరేగింపు, కోలాటం, చక్కభజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో కన్వీనర్ శ్రీరాములు, కౌన్సిలర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.